సిద్దిపేటలో మున్సిపల్ కార్మికులకు స్వీటు తినిపిస్తున్న హరీశ్‌రావు

అవార్డులు వస్తే అభినందనలు తెలుపరా?

- కనీసం ట్వీట్ లేదు.. పత్రికా ప్రకటనా లేదు
- సర్కార్ తీరుపై ఎమ్మెల్యే హరీశ్‌రావు విస్మయం

సంగారెడ్డి, జనవరి 14 (నమస్తే తెలంగాణ)/సిద్దిపేట: దక్షిణాదిలో సిద్దిపేట పట్టణానికి క్లీన్‌సిటీ అవార్డు వస్తే అభినందనలు తెలుపని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేటకు అవార్డు వచ్చినందుకు ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశంలోనే పరిశుభ్రమైన పట్టణంగా సిద్దిపేట నిలిచిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ అవార్డు వచ్చినా కేసీఆర్ సర్కార్ పిలిచి అభినందించేదని గుర్తుచేశారు. 2023లో దేశంలో 4,416 మున్సిపాలిటీల్లో 9వ స్థానంలో హైదరాబాద్ నిలిస్తే, దక్షిణాదిలో సిద్దిపేట మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందన ట్వీట్, ప్రెస్‌నోట్‌కు కూడా నోచుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రశంసించకపోయినా తమకు ప్రజల ఆశీస్సులు ఉన్నాయని హరీశ్‌రావు అన్నారు. అనంతరం ఆయన సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి స్వర్ణాభరణ అలంకరణ ఉత్సవాల్లో పాల్గొన్నారు. న్యాల్‌కల్ మండలం రేజింతల్‌లోని సిద్ధివినాయక స్వామి జయంత్యుత్సవాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తర్వాత జహీరాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకుడు ఖిజర్ యాపై నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీకి హాజరై గెలుపొందిన సంగారెడ్డి జట్టుకు ట్రోఫీని అందజేశారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్
- ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పణ



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో వెంటనే కులగణన నిర్వహించాలని, బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేయడంతోపాటు బీసీ కులగణన తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన నిర్వహిస్తామని రాహుల్‌గాంధీ స్పష్టంగా చెప్పడంతోపాటు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విడుదల సందర్భంగా కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే హామీని ఇచ్చిందని ముఖ్యమంత్రికి గుర్తు చేశారు. ఈ అంశంపై ఇటీవల రాహుల్ గాంధీని కలిసి వివరించామని, అందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవీకాలం 15 రోజుల్లో ముగియనున్నందున పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతున్నట్టు తెలుస్తున్నదని జాజుల పేర్కొంటూ.. బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే ఆ ఎన్నికలు నిర్వహించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రం భక్తులతో సందడిగా మారింది. సంక్రాంతి పండుగతోపాటు వరుస సెలవులు రావడంతో ఆదివారం స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. దేవాలయ ప్రాంగణం, మాడవీధులు, పుష్కరిణి ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్లు, క్యూ కాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, బస్సు ప్రాంగణంలో రద్దీ కనిపించింది. ధర్మ దర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. 33 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ఖజానాకు రూ.45,52,569 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. – యాదగిరిగుట్ట

ఐనవోలుకు పోటెత్తిన భక్తులు

హనుమకొండ జిల్లాలోని ఐనవోలు మల్లికార్జున స్వామి జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. భోగి సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం క్యూ కట్టారు. విడిది చేసిన వద్దే ఒగ్గు పూజారులు బోనాలు, పట్నాలు వేశారు. భక్తులు స్వామివారికి నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజ సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, అరూరి రమేశ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. –ఐనవోలు

రాహుల్ బస్సు తెలంగాణదే!

- భారత్ జోడో యాత్రకు తెలంగాణ బస్సు
- ఏఐసీసీ పేరుతో (TS09GF8055) ఖైరతాబాద్ ఆర్టీవోలో రిజిస్ట్రేషన్
- తండ్రిపేరు స్థానంలో సుదగోని లక్ష్మీనారాయణగౌడ్
- ఏఐసీసీ వ్యయాన్ని మోసేది తెలంగాణ కాంగ్రెస్సే

రాహుల్‌గాంధీ యాత్ర కోసం తెలంగాణ నుంచి కొనుగోలు చేసిన బస్సు

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి అప్పుడే బంగారు గుడ్లు పెట్టే బాతుగా మారినట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలరోజులకే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఆర్థిక భారాలను మోసే రాష్ట్రంగా తెలంగాణ మారిపోయింది. మణిపూర్ నుంచి ఆదివారం ప్రారంభమైన భారత్ జోడో న్యాయ్ యాత్రలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రయాణించే ఖరీదైన బుల్లెట్ ప్రూఫ్ ఓల్వో బస్సును (TS09GF8055) తెలంగాణ కాంగ్రెస్ కమిటీయే కొనుగోలు చేసి సమకూర్చింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పేరిట ఈ నెల 4వ తేదీన ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయంలో ఇది టీఎస్ 09 జీఎఫ్ 8055 నంబర్‌తో రిజిస్ట్రేషన్ అయింది. రిజిస్ట్రేషన్ వివరాల ప్రకారం దీనిని సుదగోని లక్ష్మీనారాయణ అనే వ్యక్తి కొనుగోలు చేసి అల్ ఇండియా కాంగ్రెస్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఇతను నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తిగా కాంగ్రెస్ వర్గాల సమాచారం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్ణాటకలో అధికారంలో ఆ పార్టీ ప్రభుత్వం నిధులు సమకూర్చినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో కర్ణాటక నుంచి తెలంగాణకు కోట్లాది రుపాయలు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వ్యయాన్ని తెలంగాణలో అధికారంలో ఉన్న ఆ పార్టీ నాయకత్వం భరిస్తుందనడానికి భారత్ జోడో న్యాయ్ యాత్రకు బహూకరించిన ఖరీదైన ఓల్వో 9400 మాడల్ బస్సే నిదర్శనమని తెలంగాణవాదులు అంటున్నారు.

రాష్ట్రంలో ఓటర్లు 3.28 కోట్లు

- ముసాయిదా జాబితా విడుదల
- ఈ నెల 20, 21వ తేదీల్లో బూత్‌స్థాయిలో అభ్యంతరాలు
- ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 3,28,29,498 ఓటర్లు ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల ముసాయిదా జాబితాను వెల్లడించింది. మొత్తం ఓటర్లలో 1,64,01,046 మంది పురుష ఓటర్లు, 1,64,25,784 మంది మహిళా ఓటర్లు ఉండగా థర్డ్ జెండర్‌లు 2,668 మంది ఉన్నారని తెలిపింది. గత అసెంబ్లీ నాటికి ఇప్పటికి ఆరు లక్షల మంది ఓటర్లు అదనంగా పెరిగారు. వీరికోసం 35,356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్ల వయస్సు నిండిన వారికి డిసెంబర్ 20 నుంచి జనవరి 5వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల కోసం మొత్తం 11,99,850 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొత్తగా ఓటు కోసం 7,69,048 మందది దరఖాస్తు చేసుకోగా.. ఓటు తొలగింపు కోసం 2,90,123, చిరునామా మార్పు కోసం 1,40,679 మంది అప్లై చేసుకున్నారు. దరఖాస్తులను విచారణ చేసి ముసాయిదా జాబితాను ప్రచురించారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 22వ తేదీలోగా తెలుపవచ్చని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. అభ్యంతరాలను తెలిపేందుకు తెలంగాణవ్యాప్తంగా ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రత్యేకంగా బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని ప్రకటించారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను అక్కడే తెలుపవచ్చని, జాబితాపై వచ్చే అభ్యంతరాలను స్వీకరించి, అభ్యంతరాలను ఫిబ్రవరి 2వ తేదీలోగా పరిష్కరించనున్నట్టు వెల్లడించారు. ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని, ఓటర్లు తమ ఓటు జాబితాలో ఉందో లేదో మరోసారి సరి చూసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఇదే జాబితా ఆధారంగా లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నది.

శాసనసభ సలహాదారుడిగా ప్రసన్నకుమార్

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసన సభ సలహాదారుడిగా సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సలహాదారుగా ప్రసన్నకుమార్ పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించగా, అసెంబ్లీ స్పీకర్ జీ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రసన్నకుమార్ లోక్‌సభ స్పీకర్‌కు ఓఎస్డీగా, ఢిల్లీ శాసనసభకు కార్యదర్శిగా, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో ఓఎస్డీగా పనిచేశారు. సుప్రీం కోర్టులో రిజిస్ట్రార్‌గా కూడా కొంత కాలం బాధ్యతలు నిర్వర్తించారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

- జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యమివ్వాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం మేరకు ఉన్న బీసీలను కాంగ్రెస్ పార్టీ చాలా కాలం నుంచి విస్మరిస్తున్నదని ఆదివారం ఓ ప్రకటనలో వాపోయారు. ఇకనైనా నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవుల్లో బీసీలకు 50% కేటాయించేలా చొరవ చూపాలని కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు

పెట్టుబడుల సాధనే లక్ష్యం

- రాష్ట్రంలోని సానుకూలతలను డబ్ల్యూఈఎఫ్‌లో చాటిచెప్తాం
- 70 కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతాం
- కీలక రంగాల్లో పెట్టుబడులకు ఒప్పందాలు జరిగే అవకాశం
- దావోస్ పర్యటనపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా దావోస్ (స్విట్జర్లాండ్) పర్యటనకు వెళ్తున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వేదిక ద్వారా ప్రపంచ దేశాలకు చాటిచెప్తామని, ఈ సందర్భంగా ఫార్మా, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, ఏరోస్పేస్, ఆహార శుద్ధి, పునరుత్పాదక ఇంధనం లాంటి కొన్ని రంగాలతోపాటు డాటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన పెట్టుబడుల కోసం ఎంవోయూలు కుదుర్చుకునే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే డబ్ల్యూఈఎఫ్ 54వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర అధికార బృందంతో కలిసి స్విట్జర్లాండ్‌కు వెళ్తున్న మంత్రి శ్రీధర్‌బాబు.. ఆ పర్యటనకు సంబంధించిన వివరాలను ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దావోస్‌లో తాము వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు బ్రెండే బోర్జ్‌తోపాటు గూగుల్, ఉబర్, మాస్టర్‌కార్డ్, నోవార్టిస్, మెడ్ ట్రానిక్స్, ఆస్ట్రాజెనికా, బేయర్, ఎల్డీసీ, యూపీఎల్ లాంటి అంతర్జాతీయ కంపెనీలు, భారత్‌కు చెందిన టాటా, విప్రో, హెచ్‌సీఎల్, జేఎస్‌డబ్ల్యూ, గోద్రెజ్, ఎయిర్‌టెల్, బజాజ్, సీఐఐ, నాస్కాం తదితర సంస్థలకు చెందిన 70 మందికిపైగా ప్రతినిధులతో భేటీ కానున్నట్టు వివరించారు.

డబ్ల్యూఈఎఫ్‌లో సీఎం ప్రసంగం

వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు తెలంగాణ ముఖ్యమంత్రి హాజరు కానుండటం ఇదే తొలిసారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. డబ్ల్యూఈఎఫ్ కాంగ్రెస్ సెంటర్‌లో జరిగే చర్చాగోష్ఠిలో ప్రసంగించాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని, వైద్యరంగం పురోగతిపై ఆయన తన అభిప్రాయాలను పంచుకోవడంతోపాటు అగ్రి–ఎకానమీపై వాతావరణ మార్పుల ప్రభావం, రైతుల జీవనోపాధిని పరిరక్షించడం, పర్యావరణ అనుకూల సాగు విధానాలను ప్రోత్సహించడంపై ప్రసంగిస్తారని వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిశ్రమ వర్గాలు ఏర్పాటు చేయనున్న చర్చా వేదికలో 'డెవలపింగ్ స్కిల్స్ ఫర్ ఏఐ' అనే అంశంపై తాను మాట్లాడనున్నట్టు మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

ఎన్నికల తర్వాత కాంగ్రెస్ సర్కార్ పతనం

- బీఆర్ఎస్‌కు టచ్‌లో చాలామంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- బీజేపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తే కేంద్రం నుంచి అధిక నిధులు
- బీజేపీ ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

కరీంనగర్ విద్యానగర్ జనవరి 14: పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నదని బీజేపీ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. చాలామంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌తో టచ్‌లో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరుగుతున్నదని, జాగ్రత్తగా ఉండాలని తాను సలహా ఇస్తే దానిని అర్థం చేసుకోకుండా మంత్రి పొన్నం ప్రభాకర్ తనను వ్యక్తిగతంగా దూషిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా కేంద్రంతోపాటు హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ వల్లనే కాంగ్రెస్ పార్టీ నాశనం అవుతుందని పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్ నాయకులపై మాట్లాడితే పొన్నం ప్రభాకర్‌కు ఎందుకు కోపం వస్తున్నదని ప్రశ్నించారు. తన ఓపికను పరీక్షించవద్దని హెచ్చరించారు. 'బండి సంజయ్ పిల్లలు కొత్త బట్టలు వేసుకోవద్దా? కొత్త బండి కొనుక్కోవద్దా? ఎంపీగా ఉన్న తాను కటౌట్లు పెట్టుకోవద్దా?' అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే, కేంద్రంలో బీజేపీ ఎంపీలు ఎక్కువగా గెలవాలని, మోదీని ఒప్పించి నిధులు తీసుకొస్తామని చెప్పారు. ఇతర పార్టీలకు ఓటు వేస్తే అదనపు నిధులు కాదు కదా కొత్త అప్పులు కూడా పుట్టవని హెచ్చరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీ నేతలు కలిసి పనిచేస్తే తెలంగాణకు అత్యధిక నిధులు తీసుకొచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అయోధ్య రామమందిరం పూర్తికాక ముందే పున:ప్రతిష్ఠ చేస్తున్నారనే ఆరోపణలపై స్పందించిన బండి సంజయ్.. సాధు సంతువులు సూచించిన ముహూర్తం ప్రకారమే జరుగుతున్నదని తెలిపారు. దీనిపై రాజకీయాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు రామ మందిర నిర్మాణానికి అనుకూలమా? వ్యతిరేకమా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఖరారు

- నేడు ప్రకటించే అవకాశం
- ఎమ్మెల్యే కోటాలో మహేశ్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్‌కు అవకాశం
- గవర్నర్ కోటాలో కోదండరాం, జాఫర్?
- కీలక నామినేటెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలో భర్తీ చేయబోయే నాలుగు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను కాంగ్రెస్ అధిష్ఠానం ఎట్టకేలకు ఖరారు చేసింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాసు మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి శనివారమే కసరత్తు చేసి ఎమ్మెల్సీ అభ్యర్థులతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీ ఎంపిక ప్రక్రియ పూర్తిచేసినట్టు తెలిసింది. పార్టీ అధిష్ఠానం కూడా దీనికి ఆమోదముద్ర వేయడంతో అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. ఎమ్మెల్యే కోటాలో ఒక బీసీ, ఒక ఎస్సీ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఖరారుచేసినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్లి తిరిగి ఈ నెల 21న హైదరాబాద్ చేరుకుంటారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల నామినేషన్ల దాఖలుకు ఈ నెల 18 వరకే గడువు ఉండడంతో ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఫారాలను సీఎం ఇప్పటికే అందజేసినట్టు సమాచారం. బీసీ సామాజికవర్గం నుంచి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎస్సీ సామాజిక వర్గం నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌ను ఎంపిక చేసినట్టు ప్రచారం జరుగుతున్నది.

పరిశీలనలో పలువురు మైనార్టీ నేతల పేర్లు

గవర్నర్ కోటా కింద భర్తీ చేయబోయే రెండు ఎమ్మెల్సీల్లో ఒకటి తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రముఖ విద్యాసంస్థల అధిపతి జాఫర్‌జావేద్‌ను ఖరారు చేసినట్టు తెలిసింది. కాంగ్రెస్ నుంచి పోటీచేసిన మైనార్టీ అభ్యర్థులు ఎవరూ గెలవకపోవడంతో ఎమ్మెల్సీల ఎంపికలో ఆ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ భావిస్తున్నది. అందులో భాగంగా ఏఐసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫయీమ్ ఖురేషీ, మస్కతి డెయిరీఫామ్ యజమాని మస్కతి, ముఖకంజా విద్యాసంస్థల అధిపతి జాఫర్ జావేద్‌తో పాటు మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, ఫిరోజ్‌ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం దక్కని నేతలకు, టికెట్ ప్రకటించి చివరి నిమిషంలో రద్దు చేసిన డజనుమంది నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం.

దేవుని పేరుతో దేశ రాజకీయం

- ఎన్నికల కోసమే అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపన
- రాముడి కటౌట్లతో ఓట్లు అడిగేందుకు బీజేపీ స్టంట్
- మా ప్రభుత్వాన్ని ఎవరూ కూల్చలేరు
- మా ఎమ్మెల్యేలను ముట్టుకొనే ధైర్యం ఎవరికీ లేదు
- బండి సంజయ్ వ్యాఖ్యలు అర్థరహితం
- మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్

కరీంనగర్ రాంనగర్/వేములవాడ టౌన్, డిసెంబర్ 14: దేశంలో దేవుడిని అడ్డం పెట్టుకొని కొందరు రాజకీయ ప్రచారం చేస్తున్నారని, ఈ విషయాన్ని తాము ప్రశ్నిస్తే హిందువులకు వ్యతిరేకమంటున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్నను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఆయా సందర్భాల్లో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేవుడు తమకే సొంతం అన్నట్టుగా కొందరి వ్యవహారం ఉన్నదని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే అయోధ్య రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆదరాబాదరాగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. హిందూత్వను విశ్వసించే ప్రతిఒక్కరూ ఈ విషయంపై ఆలోచన చేయాలని కోరారు. అయోధ్య రామాలయం ప్రారంభం ఎన్నికల స్టంటేనని, రాముడి కటౌట్లు పెట్టుకొని ఓట్లు అడిగేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. జగద్గురువులు చెప్పినా వినకుండా అశాస్త్రీయంగా ఆలయ ప్రారంభోత్సవాన్ని చేయాలనుకోవడం సరికాదని హితవు చెప్పారు.

కాంగ్రెస్‌ను ముట్టుకొనే ధైర్యం లేదు

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించడం అర్థరహితమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలు జ్యోతిష్కుడి మాదిరిగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే, తమ పార్టీ ఎమ్మెల్యేలను ముట్టుకొనే ధైర్యం ఎవరూ చేయలేరని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని ఆరోపించారు. వైఫల్యం చెందిన ఎంపీల్లో బండి సంజయ్ దేశంలోనే నంబర్ వన్ అని విమర్శించారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ కరీంనగర్‌కు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉంటే ఆరు గ్యారెంటీలతోపాటు పేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారు.

నాగోబా జాతర ప్రచార రథం ప్రారంభం

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో ఫిబ్రవరి 9న నిర్వహించే నాగోబా జాతరకు సంబంధించి ప్రచార రథం ప్రారంభమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మెస్రం వంశీయులు ఆదివారం ఉదయం కేస్లాపూర్‌కు చేరుకున్నారు. పురాతన నాగోబా ఆలయంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ సంప్రదాయ పూజలు నిర్వహించి ప్రచార రథాన్ని గ్రామ పొలిమేర వరకు సాగనంపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

- ఆటోను కారు ఢీకొనడంతో ఘటన
- మృతులది ఒకే కుటుంబం
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన

మహబూబాబాద్ రూరల్, జనవరి 14 : పుట్టువెంట్రుకలు ఇచ్చి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని కంబాలపల్లి గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చిన్న ఎల్లాపురం గ్రామ శివారు ఆముతండాకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇస్లావత్ శ్రీను (35) తన కుమారుడు రిత్విక్ (6), కూతురు రిత్విక (4), అతడి తల్లి ఇస్